సాటి ఎవ్వరు? పోటీ ఎవ్వరు?



రాజకీయంగా కేసీఆర్‌కు సరితూగే నేత ఎవ్వరు?

కేసీఆర్‌లాగా తెలంగాణను ప్రేమించేది ఎవరు? దార్శనికుడిగా కేసీఆర్ దరిదాపుల్లో ఉన్నదెవరు?

ఎమ్మెలే, ఎంపీ, రాష్ట్ర మంత్రి, కేంద్ర మంత్రి.. ముఖ్యమంత్రిగా కేసీఆర్ చేపట్టని పదవి ఏది?

తెలంగాణను దేశానికి రోల్‌మాడల్‌గా నిలిపిందెవరు?.. జాతీయస్థాయిలో తెలంగాణకు గౌరవం తెచ్చిందెవరు?

45 ఏండ్ల సుదీర్ఘ రాజకీయ అనుభవం కేసీఆర్‌ది.. 38 ఏండ్లుగా చట్టసభల్లో ఉన్న అనుభవం ఆయనది

హ్యాట్రిక్ సీఎంగా కేసీఆర్‌కు చిరుకానుక ఇవ్వలేమా?

విద్యానికైనా, కయ్యానికైనా సమఉజ్జీలు ఉండాలంటారు. మరి తెలంగాణ రాష్ట్ర ఎన్నికల సమరాంగణంలో బీఆర్ఎస్ అధినేత, సీఎం కేసీఆర్‌కు సరితూగగల రాజకీయ ప్రత్యర్థి ఎవరు? కేసీఆర్ స్ట్రేచర్‌కు సరితూగే రాజకీయ ప్రత్యర్థులు కాంగ్రెస్‌లోగానీ, బీజేపీలోగానీ ఎవరున్నారు? ప్రజలు తమ పాలకుడిని ఎంచుకోవాల్సి వచ్చినప్పుడు బరిలో ఉన్నవారిలో పాలనా దక్షత, విజన్, చిత్తశుద్ధిని బేరీజు వేసుకుంటారు. అలా చూసినప్పుడు సీఎం కేసీఆర్ స్ట్రేచర్‌కు సరితూగే నాయకుడు కాంగ్రెస్, బీజేపీలో ఎవరున్నారని భూతద్దం పెట్టుకొని వెదికినా దరిదాపుల్లో కూడా ఎవరూ కనిపించరు.

వెల్జాల చంద్రశేఖర్ (స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, అక్టోబర్ 14 (నమస్తే తెలంగాణ): రాజకీయాల్లో సీఎం కేసీఆర్‌కు 45 ఏండ్ల సుదీర్ఘ అనుభవం ఉన్నది. చట్టసభల్లో ఎమ్మెల్యేగా, ఎంపీగా, రాష్ట్ర మంత్రిగా, కేంద్ర మంత్రిగా, రెండుసార్లు ముఖ్యమంత్రిగా 38 ఏండ్ల అపార అనుభవం ఆయన సొంతం. బీఆర్ఎస్ పార్టీకి ప్రత్యామ్నాయం తామేనని చెప్పుకొంటున్న కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు రేవంత్‌రెడ్డికి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి వయసులే కేసీఆర్ రాజకీయ అనుభవమంత లేవు. సిద్దిపేట నుంచి 1983లో కేసీఆర్ ఎమ్మెల్యేగా పోటీ చేసినప్పుడు రేవంత్‌రెడ్డి వయసు 14 ఏండ్లు (1969లో జన్మించారు). అప్పటికి ఆయన పదోతరగతి చవటంలేదు. కిషన్‌రెడ్డికి అప్పుడు 19 ఏండ్లు (1964 జన్మించారు). కేసీఆర్ యూత్‌కాంగ్రెస్ నేతగా ఊపుమీదున్నప్పుడు వీరిద్దరూ ఊహ కూడా తెలియని చిన్నపిల్లలు. ఏకబిగిన సుదీర్ఘకాలం తెలుగు ముఖ్యమంత్రిగా పనిచేసిన రికార్డు కూడా సీఎం కేసీఆర్‌దే.

> 2014 జూన్ 2న తొలిసారి సీఎంగా పగ్గాలు చేపట్టిన కేసీఆర్.. నేటికి అంటే 15-10-2023 నాటికి ఏకబిగిన 9 ఏండ్ల 134 రోజులుగా సీఎంగా కొనసాగుతున్నారు. అవాంతరాలు లేకుండా ఇంత సుదీర్ఘంగా సీఎంగా కొనసాగిన తెలుగు నేత మరెవరూ లేరు.

కేసీఆర్ మరో రికార్డు కూడా చేరువలో ఉన్నారు. వచ్చే ఎన్నికల్లో గెలుపు ద్వారా దక్షిణ భారతదేశంలో వరుసగా మూడుసార్లు సీఎం అయిన వ్యక్తిగా నిలిచేందుకు కొద్దిదూరంలోనే ఉన్నారు. సమకాలీన భారతదేశ రాజకీయ రంగంలో కేసీఆర్‌కు ఉన్న ఘనతలు మరెవరికీ లేవు. స్వయంగా ఒక ఉద్యమ పార్టీని స్థాపించి 14 ఏండ్ల సుదీర్ఘ పోరాటంలో ప్రాణ త్యాగానికి కూడా వెనుకాడక తెలంగాణ రాష్ట్రాన్ని సాధించారు. సాధించుకున్న రాష్ట్రానికి తొమ్మిదిన్నరేండ్లుగా ముఖ్యమంత్రిగా, 22 ఏండ్లుగా బీఆర్ఎస్ పార్టీకి అధ్యక్షునిగా కొనసాగుతున్నారు. ఏడాది కిందట బీఆర్ఎస్ జాతీయ పార్టీగా అవతరించింది. ప్రాంతీయ పార్టీ నుంచి జాతీయ పార్టీగా ఆవిర్భవించిన బీఆర్ఎస్ అధినేతగా, సీఎంగా దేశ రాజకీయాల్లో కేసీఆర్ ఇప్పుడు ఒక కీలక నాయకుడు. ప్రధాని పదవికి పోటీ పడే నాయకుల్లో కేసీఆర్ ఒకరని జాతీయ మీడియా, దేశ ప్రజలు భావిస్తున్నారు.

ఆ స్ట్రేచరే వేరు

ప్రధాని మోదీ మొదలుకొని, వివిధ రాష్ట్రాల సీఎంలలో ఎవరికీ లేని ఒక అరుదైన ఖ్యాతిని కేసీఆర్ సొంతం చేసుకున్నారు. తెలంగాణ రాష్ట్ర సాధనకు ఒక ఉద్యమ పార్టీని స్థాపించి రాష్ట్రాన్ని సాధించిన చరిత్ర సమకాలీన నేతల్లో ఎవరికీ లేదు. కేసీఆర్ రాష్ట్రాన్ని సాధించడం వరకే పరిమితం కాలేదు. సాధించిన రాష్ట్రాన్ని దేశంలోనే ఒక రోల్‌మాడల్‌గా తీర్చిదిద్దారు. దేశ రాజధాని ఢిల్లీలో గతంలో దక్షిణాదివారిని మద్రాసీలు అని పిలిచేవారు. ఆ తర్వాత దివంగత ఎన్టీఆర్ తెలుగువారి ఆత్మగౌరవాన్ని చాటాక ఆంధ్రవాలే అనేవారు. ఇప్పుడు కేసీఆర్‌వల్ల తెలంగాణే వాలే అంటున్నారు. ఇది కేసీఆర్‌కు దేశవ్యాప్తంగా ఉన్న గుర్తింపునకు నిదర్శనం. తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించిన తర్వాత సీఎం కేసీఆర్ ఇక్కడ అమలు చేసిన అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాలు దేశానికి రోల్‌మాడల్‌గా మారాయి. తెలంగాణ కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన అవార్డులు, రివార్డులే ఇందుకు నిదర్శనం. ప్రధాని మోదీ స్వయంగా పలు సందర్భాల్లో బీజేపీ పాలిత రాష్ట్రాలను తెలంగాణకు వెళ్లి ఇక్కడి పథకాలను అధ్యయనం చేసి రావాలని సూచించారు. కేంద్ర బృందాలు, ఇతర రాష్ట్రాల బృందాలు తెలంగాణకు ఇప్పటికీ వచ్చి నీటిపారుదల ప్రాజెక్టులను, పథకాలను అధ్యయనం చేసి వెళ్తున్నాయి. ప్రపంచంలోనే అతి పెద్దదిగా చరిత్ర సృష్టించిన కాళేశ్వరం ఎత్తిపోతలను కొనియాడని అంతర్జాతీయ సంస్థలు, మీడియా సంస్థలు లేవంటే అతిశయోక్తి కాదు. దేశాన్ని కాంగ్రెస్, బీజేపీ పాలిస్తున్నప్పుడు వ్యవసాయరంగం సంక్షోభంలో చిక్కుకొని కుదేలైనాయి. కానీ, వ్యవసాయం దండుగ అన్న గత పాలకుల కండ్లు తెరిపించేలా రైతుబంధు, రైతుబీమా వంటి పథకాలతో సాగును పండుగగా తీర్చిదిద్దిన రైతు పక్షపాతిగా కేసీఆర్‌కు దేశవ్యాప్తంగా ఖ్యాతి గడించారు. కాంగ్రెస్, బీజేపీ దళిత జనోద్ధరణ జపం చేయడమేకాని ఆ దిశగా ఏనాడూ చిత్తశుద్ధితో పనిచేయలేదు. కలలో కూడా ఉహించని, ఆలోచించని విప్లవవాత్మక దళితబంధు పథకానికి రూపకల్పన చేసి ప్రవేశపెట్టింది కేసీఆరే. దేశంలో అతి పెద్ద అంబేద్కర్ విగ్రహాన్ని తెలంగాణలో ప్రతిష్టించి దళిత సంఘాలు, నాయకుల నుంచి అభినవ అంబేద్కర్‌గా కితాబు అందుకున్నది మన సీఎం కేసీఆరే.

> ప్రధాని మోదీ మొదలుకొని, వివిధ రాష్ట్రాల సీఎంలలో ఎవరికీ లేని ఒక అరుదైన ఖ్యాతిని కేసీఆర్ సొంతం చేసుకున్నారు. తెలంగాణ రాష్ట్ర సాధనకు ఒక ఉద్యమ పార్టీని స్థాపించి రాష్ట్రాన్ని సాధించిన చరిత్ర సమకాలీన నేతల్లో ఎవరికీ లేదు. కేసీఆర్ రాష్ట్రాన్ని సాధించడం వరకే పరిమితం కాలేదు. సాధించిన రాష్ట్రాన్ని దేశంలోనే ఒక రోల్‌మాడల్‌గా తీర్చిదిద్దారు.

కేసీఆర్ కంటే ఎక్కువగా ప్రేమించే వారు ఎవరున్నారు?

సీఎం కేసీఆర్ కంటే తెలంగాణను ఎక్కువగా ప్రేమించే నాయకుడు ఎవరున్నారు? కేసీఆర్ అంటే గిట్టని రాజకీయ ప్రత్యర్థులు కూడా కాదనలేని అక్షర సత్యం ఇది. సమైక్య రాష్ట్రంలో తెలంగాణ ప్రాంతం, ప్రజలు ఎదుర్కొన్న కడగండ్లు, కన్నీళ్లు చూసి భరించలేక తన రాజకీయ భవిష్యత్తును సైతం పణంగా పెట్టి, చట్టసభల్లో పదవులను తృణప్రాయంగా త్యజించిన అరుదైన నాయకుడు కేసీఆర్. రాష్ట్ర సాధన ఒక్కటే తెలంగాణ కష్టాలకు పరిష్కారమని నమ్మి, ప్రజలను ఒప్పించి, ఉద్యమంలో భాగస్వాములను చేశారు. దాదాపు దశాబ్దన్నర కాలం అనేక కష్టనష్టాలు ఎదుర్కొని, ఎన్నో అవమానాలను భరించి ఎట్టకేలకూ తనుకున్న లక్ష్యాన్ని సాధించిన ధీరోదాత్తుడు. ఒక ప్రాంత ప్రజల విముక్తి కోసం అలుపెరగని పోరాటం చేసి నిలిచి గెలిచిన కేసీఆర్ స్ట్రేచర్‌కు సరితూగే రాజకీయ నేత ఇంకేపార్టీల్లో అయినా ఉన్నారా? తెలంగాణకు అదిచేస్తాం.. ఇది చేస్తాం అంటూ కల్లబొల్లి కబుర్లు చెప్తున్న కాంగ్రెస్ పార్టీ గురించి కూడా కేసీఆర్‌కు తెలిసినంతగా ఎవరికీ తెలియదు. తల్లి పుట్టిల్లు మేనమామకు ఎరుక అన్నట్టు, యూత్ కాంగ్రెస్ నేతగా ఉన్నప్పటి నుంచీ దాదాపు 50 ఏండ్లుగా కాంగ్రెస్ తీరును ఆయన గమనిస్తూనే ఉన్నారు. తెలంగాణ ప్రజల కష్టాలు, కన్నీళ్లు తుడిచేందుకు ఆహోరాత్రులు ఆలోచించి రాష్ట్రాన్ని బంగారు తెలంగాణగా తీర్చిదిద్దడానికి ప్రణాళికలు రూపొందించి, అమలు చేసిన గొప్ప విజన్ ఉన్న నాయకుడు కేసీఆర్. సంక్షేమం, అభివృద్ధిని సమపాళ్లలో రంగరించి తెలంగాణ రాష్ట్రాన్ని దేశంలోనే అగ్రస్థానంలో నిలిపింది కేసీఆర్ కాదా? రాష్ట్రం ఏర్పడకముందు తెలంగాణ ఎట్లుండె? ఇప్పుడెంట్లున్నదో అర్థం కావడం లేదా? తలసరి ఆదాయంలో తెలంగాణ ఇప్పుడు దేశంలో నంబర్‌వన్ స్థానంలో నిలిచింది అంటే అది సీఎం కేసీఆర్ కృషికి, చిత్తశుద్ధికి నిదర్శనం కాదా? ఏ కోణంలో చూసినా వర్తమాన రాజకీయాల్లో కేసీఆర్‌కు సరితూగే నాయకుడు ఒక్కరంటే ఒక్కరు ఉన్నారా? తెలంగాణ ప్రజల గుండెల్లో కేసీఆర్ పట్ల ఉన్నంత అభిమానం, పాపులారిటీ ఇంకే నాయకుడికైనా ఉన్నదా?

ప్రతిఫలంగా ఏమిద్దాం?

సీఎంగా హ్యాట్రిక్ విజయాన్ని నమోదుచేసేందుకు కేసీఆర్ చేరువలో ఉన్నారు. తెలంగాణ ప్రజల 60 ఏండ్ల చిరకాల స్వప్నమైన ప్రత్యేక రాష్ట్ర కలను సాకారం చేసిన కేసీఆర్‌కు ప్రతిఫలంగా దక్షిణాది నుంచి హ్యాట్రిక్ సాధించిన తొలి సీఎంగా నిలిపి చిరుకానుకగా ఇవ్వలేమా? ప్రతిఒక్కరూ మనసు పెట్టి ఆలోచించాలి. ఈ సందర్భంగా చరిత్రలో ఒక ఘటనను గుర్తు చేసుకుంటే అంతకంటే స్ఫూర్తి మరొకటి ఉండదు. తెలంగాణ ముద్దుబిడ్డ పీవీ నరసింహారావుకు దక్షిణాది నుంచి తొలి ప్రధానిగాఅవకాశం లభించింది.

> అప్పట్లో జాతీయస్థాయిలో విపక్ష కూటమి అయిన నేషనల్ ఫ్రంట్‌కు ఎన్టీఆర్ చైర్మన్‌గా ఉన్నారు. ప్రధాని హోదాలో పీవీ నరసింహారావు నంద్యాల నుంచి లోక్‌సభ ఎన్నికల బరిలో నిలిచారు. దేశ ప్రధానిగా తొలిసారి ఒక దక్షిణాది వ్యక్తికి, ముఖ్యంగా తెలుగుబిడ్డకు ఈ అవకాశం దక్కడంతో ఒక తెలుగువాడిగా గర్వపడుతూ నంద్యాలలో పీవీపై టీడీపీ పోటీకి అభ్యర్థిని పెట్టడంలేదని ఎన్టీఆర్ ప్రకటించారు. తెలుగువాడిగా పీవీ పట్ల ఎన్టీఆర్‌కే అంత అభిమానం ఉంటే, తెలంగాణ రాష్ట్రాన్ని సాధించిపెట్టిన కేసీఆర్ పట్ల మనకేంత అభిమానం ఉండాలి? ఇది ప్రతి ఒక్క తెలంగాణ బిడ్డ ఆలోచించి నిర్ణయం తీసుకోవాల్సిన తరుణం.

విద్వేషాలు లేనంతకాలం శాంతి వర్ధిల్లుతుంది

- **భారత్-చైనా ప్రజలు చిరకాల మిత్రులు**
- **ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ బీ వినోద్**

జాతీయ సదస్సులో మాట్లాడుతున్న ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ బోయినపల్లి వినోద్‌కుమార్

హైదరాబాద్, అక్టోబర్ 14 (నమస్తే తెలంగాణ): ప్రపంచంలో శాంతి ఎంతో అవసరమని రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ బోయినపల్లి వినోద్ కుమార్ తెలిపారు. విద్వేషాలు లేనంతకాలం శాంతి వర్ధిల్లుతుందని పేర్కొన్నారు. శనివారం ఖైరతాబాద్‌లోని విశ్వేశ్వరయ్య భవన్‌లో 'ఇండియా-చైనా మిత్ర మండలి సంఘం' ఆధ్వర్యంలో జరిగిన జాతీయ సదస్సులో ఆయన మాట్లాడారు. కొన్ని దేశాల మధ్య ఘర్షణలు జరుగుతుండడం బాధాకరమన్న ఆయన.. దీనివల్ల విధ్వంసం తప్ప మరేమీ ఉండదని పేర్కొన్నారు. సీఎం కేసీఆర్ పాలనలో రాష్ట్రంలో శాంతిభద్రతలు పూర్తిగా అదుపులో ఉన్నాయని, కాబట్టే తెలంగాణలో పెట్టుబడులకు ప్రపంచ దేశాలు తరలివస్తున్నాయని వివరించారు. ఇరు దేశాల ప్రభుత్వాల తీరు ఎలా ఉన్నా చైనా-ఇండియా ప్రజలు మాత్రం చిరకాల మిత్రులని తెలిపారు. ఆధునిక చైనా సృష్టికర్త డెంగ్ జియో పింగ్ బాటలోనే సీఎం కేసీఆర్ రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నిలిపారని ప్రశంసించారు. సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరైన షహీద్ భగత్‌సింగ్ ఫౌండేషన్ చైర్మన్ ప్రొఫెసర్ జగన్మోహన్‌సింగ్ మాట్లాడుతూ.. వ్యవసాయం, పర్యావరణ పరిరక్షణలో చైనా అవలంబిస్తున్న విధానాలు మన దేశానికి ఎంతో ఉపయోగపడతాయని పేర్కొన్నారు. ఎమ్మెల్సీ, మాజీ స్పీకర్ సిరికొండ మధుసూదనాచారి మాట్లాడుతూ.. అణుశక్తి కలిగిన దేశాల మధ్య వైరం మానవ వినాశానికి దారి తీస్తుందని హెచ్చరించారు. భారత్, చైనా మైత్రి చేసుకుంటే ప్రపంచలోనే బలమైన ఆర్థికశక్తి, సూపర్ పవర్ దేశాలుగా అభివృద్ధి చెందుతాయన్నారు. ఐసీఎఫ్ఏ అధ్యక్షుడు కే పర్వత్‌రెడ్డి, ఇండియా-చైనా మిత్ర మండలి జాతీయ అధ్యక్షుడు భాస్కరన్, ప్రధాన కార్యదర్శులు డాక్టర్ ఎం మోహన్‌రెడ్డి, విజయేందర్‌రావు తదితరులు పేర్కొన్నారు.

ఖమ్మంలో నిర్వహించిన బీఆర్ఎస్ బూత్ లెవల్ విస్తృత స్థాయి సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి పువ్వాడ. చిత్రంలో ఎమ్మెల్సీ తాతా మధు, మేయర్ నీరజ

సంక్షేమ పథకాలను ఇంటింటికీ తీసుకెళ్లాలి

- **బీఆర్ఎస్ శ్రేణులకు మంత్రి పువ్వాడ పిలుపు**

ఖమ్మం, అక్టోబర్ 14: సీఎం కేసీఆర్ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను బీఆర్ఎస్ కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు ప్రతి ఇంటికీ తీసుకెళ్లాలని రవాణాశాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ పిలుపునిచ్చారు. ఖమ్మం నగరంలోని రోటరీనగర్ మమత ఆడిటోరియంలో శనివారం నిర్వహించిన బీఆర్ఎస్ పార్టీ బూత్ లెవల్ విస్తృత స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికలకు ఇంకా 45 రోజులు మాత్రమే ఉన్నదని, ఈ సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రచారంలో భాగంగా ఎన్నికల్లో ఎవరు.. ఏ బాధ్యతలు చేపట్టాలో ముందుగానే ప్రణాళికలు రూపొందించుకోవాలని సూచించారు. ఖమ్మంలో బీఆర్ఎస్‌కు కాంగ్రెస్ పార్టీయే ప్రత్యర్థి అని ఆయన పేర్కొన్నారు. నవంబర్ 5న ఖమ్మం నగరంలో జరగనున్న సీఎం కేసీఆర్ సభను విజయవంతం చేయాలని కోరారు. ఎన్నికల ప్రచారం చివరలో మంత్రి కేటీఆర్ రోడ్ షో ఉంటుందని తెలిపారు. ఓటరు జాబితాపై డివిజన్ అధ్యక్షులు, నాయకులకు అవగాహన ఉండాలన్నారు. ఎమ్మెల్సీ, బీఆర్ఎస్ ఖమ్మం జిల్లా అధ్యక్షుడు తాతా మధుసూదన్ మాట్లాడుతూ.. ఖమ్మంను శరవేగంగా అభివృద్ధి చేసిన పువ్వాడ మరోసారి భారీ మెజార్టీతో గెలువబోతున్నారని తెలిపారు. అయినప్పటికీ పార్టీ కార్యకర్తలు, నాయకులు ప్రజల వద్దకు వెళ్లి బీఆర్ఎస్ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు వివరించాలని కోరారు.

బీఆర్ఎస్‌లోకి టీఎన్జీవో అధ్యక్షుడు మామిళ్ల

- **వీఆర్ఎస్‌కు దరఖాస్తు చేసిన రాజేందర్**
- **త్వరలో కేసీఆర్ సమక్షంలో చేరిక**
- **వీఆర్ఎస్‌ను ధ్రువీకరించిన రాజేందర్**
- **సీఎం కే చంద్రశేఖర్‌రావు సమక్షంలో పార్టీలో చేరనున్నట్టు వెల్లడి**

హైదరాబాద్, అక్టోబర్ 14 (నమస్తే తెలంగాణ): ఉద్యోగ సంఘాల జేఏసీ చైర్మన్, టీఎన్జీవో కేంద్ర సంఘం అధ్యక్షుడు మామిళ్ల రాజేందర్ రాజకీయాల్లోకి అడుగుపెట్టనున్నారు. ఆయన త్వరలో బీఆర్ఎస్‌లో చేరనున్నారు. రాజకీయాల్లోకి ప్రవేశించాలని నిర్ణయం తీసుకున్న ఆయన ఈ మేరకు స్వచ్ఛంద పదవీ విరమణ (వీఆర్ఎస్)కు దరఖాస్తు చేసుకున్నారు. రాజేందర్ శుక్రవారం వైద్యారోగ్యశాఖ డైరెక్టర్‌ను కలిసి వీఆర్ఎస్ దరఖాస్తు సమర్పించారు. సోమవారం వీఆర్ఎస్ ఆమోదం పొందే అవకాశాలున్నాయి. ఇదే విషయాన్ని రాజేందర్ ధ్రువీకరించారు. సీఎం కేసీఆర్, మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు పిలుపుమేరకు పార్టీలో చేరుతున్నట్టు ప్రకటించారు. రాజేందర్ స్వస్థలం సంగారెడ్డి కాగా, ప్రస్తుతం రంగారెడ్డి జిల్లా డీఎంఅండ్‌హెచ్‌వో కార్యాలయంలో పనిచేస్తున్నారు. రాజేందర్ రెండేండ్ల సర్వీస్‌ను వదులుకొని వీఆర్ఎస్‌కు దరఖాస్తు సమర్పించారు. ముదిరాజ్ సామాజికవర్గానికి చెందిన ఆయన ఒకట్రెండు రోజుల్లో సీఎం కేసీఆర్ సమక్షంలో బీఆర్ఎస్ కండువా కప్పుకోనున్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో ముదిరాజ్ సామాజికవర్గం మద్దతును కూడగట్టేందుకు అధిష్ఠానం ఆదేశాల మేరకే మామిళ్ల రాజేందర్ ఈ నిర్ణయం తీసుకున్నట్టు తెలుస్తున్నది. రాజేందర్ వీఆర్ఎస్ తీసుకోవడంతో టీఎన్జీవో కేంద్రం సంఘం అధ్యక్ష పదవిని వదులుకోవాల్సి ఉంటుంది. త్వరలోనే టీఎన్జీవో సంఘం కార్యవర్గ సమావేశాన్ని నిర్వహించి, నూతన అధ్యక్షుడిని ఎన్నుకోనున్నట్టు తెలుస్తున్నది. ఈ సారి అధ్యక్ష పదవికి పోటీ రసవత్తరంగా ఉండే అవకాశాలు కనిపిస్తున్నాయి.

కేసీఆర్ నాయకత్వంలో పనిచేస్తా

ప్రభుత్వ ఉద్యోగానికి స్వచ్ఛంద పదవీ విరమణకు దరఖాస్తు చేసింది నిజమే. త్వరలోనే బీఆర్ఎస్ అధినేత, సీఎం కేసీఆర్‌ను కలిసి పార్టీలో చేరుతా. సీఎం కేసీఆర్ నాయకత్వంలో అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ విజయానికి కృషిచేస్తా. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఉద్యోగ, ఉపాధ్యాయుల మద్దతుతోపాటు ముదిరాజ్‌ల మద్దతు కూడగట్టి సంగారెడ్డిలో గులాబీ జెండా ఎగురవేసేందుకు ప్రయత్నిస్తా. నన్ను పార్టీలోకి ఆహ్వానించిన సీఎం కేసీఆర్, మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు, శ్రీనివాస్‌గౌడ్‌లకు కృతజ్ఞతలు.

- మామిళ్ల రాజేందర్

ఉద్యోగ సంఘాల నేతగా..

చదువుకునే రోజుల్లో విద్యార్థి నేతగా రాణించిన రాజేందర్.. చదువుల అనంతరం 1987 జనవరిలో వైద్యారోగ్యశాఖలో జూనియర్ అసిస్టెంట్‌గా ఉద్యోగంలో చేరారు. సిద్దిపేట జిల్లాలో పనిచేసిన ఆయన సుదీర్ఘకాలం ఉద్యోగసంఘాల నేతగా కొనసాగారు. ఉమ్మడి మెదక్ జిల్లా టీఎన్జీవో సంఘం ప్రధాన కార్యదర్శిగా, అధ్యక్షుడిగా సేవలందించారు. అప్పట్లో కేసీఆర్ మంత్రిగా పనిచేసినప్పటి నుంచే రాజేందర్‌కు సాన్నిహిత్యం ఏర్పడింది. ఉద్యోగుల జేఏసీ చైర్మన్‌గా ప్రభుత్వంతో సఖ్యతగా ఉంటూ.. నల్లబ్యాడ్జీలు పెట్టకుండా.. నిరసనలు వ్యక్తంచేయకుండా ఉద్యోగులకు పెద్దన్నలా ఉంటూ అనేక సమస్యల పరిష్కారానికి కృషిచేశారు. టీఎన్జీవో కేంద్ర సంఘం ప్రధాన కార్యదర్శిగా రెండుసార్లు, అధ్యక్షుడిగా రెండుసార్లు పనిచేశారు. ఉద్యోగులకు రెండు పీఆర్సీలు ఇప్పించడం, కీలకమైన ఈహెచ్ఎస్ అమలుకు కృషిచేశారు. అనేకసార్లు ఉద్యోగుల సమస్యలపై ప్రభుత్వానికి ప్రాతినిధ్యం వహించారు. మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావుతో ఉన్న అనుబంధం దృష్ట్యా రాజకీయ ఆరంగ్రేటం చేయాలని రాజేందర్ నిర్ణయించుకున్నారు.

మైనార్టీ వ్యతిరేకి రేవంత్: మేడె రాజీవ్‌సాగర్

హైదరాబాద్, అక్టోబర్ 14 (నమస్తే తెలంగాణ): పీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి మైనార్టీలకు వ్యతిరేకంగా ప్రవర్తిస్తున్నారని తెలంగాణ ఫుడ్స్ చైర్మన్ మేడె రాజీవ్ సాగర్ మండిపడ్డారు. ఉద్దేశపూర్వకంగానే మైనార్టీ వర్గానికి చెందిన పోలీసు అధికారి స్టీఫెన్ రవీంద్రపై తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మైనార్టీ అధికారులపై రేవంత్ విషం చిమ్ముతున్నారని, ఇది రేవంత్‌కే పరిమితమా? లేక కాంగ్రెస్ విధానమే ఇదా? అని ప్రశ్నించారు. కాంగ్రెస్ అధికారంలో ఉన్న ఏ రాష్ట్రంలోనూ మైనార్టీల అభివృద్ధికి కాంగ్రెస్ కృషి చేయడం లేదని విమర్శించారు. అసలు స్టీఫెన్ రవీంద్ర అనే అధికారికి ఇప్పటి వరకు ఎలాంటి అవినీతి మచ్చ లేదని తెలిపారు. 2005లో అగ్నిప్రమాదంలో చిక్కుకున్న 61 మందిని కాపాడడంతో ఆయనకు శౌర్య పతకం, 2011 ప్రధాన మంత్రి లైఫ్ సేవింగ్ పతకం కాంగ్రెస్ హయాంలోనే వచ్చాయని గుర్తు చేశారు. రేవంత్ ఇకనైనా కులహంకార బుద్ధి మార్చుకోవాలని, లేదంటే గుణపాఠం తప్పదని హెచ్చరించారు.

వృత్తి నిపుణులకు ఉద్యోగాలు ఉత్తవే

- **ఐటీఐ అభ్యర్థుల్లో 0.09శాతం మందికే ఉపాధి**
- **నీతి ఆయోగ్ నివేదికలో వెల్లడి**
- **పరిశ్రమల్లో తగ్గిన నియామకం**
- **అయినా.. నిరుద్యోగం తగ్గిందంటూ మోదీ గప్పాలు**

హైదరాబాద్, అక్టోబర్ 14(నమస్తే తెలంగాణ): దేశంలో నిరుద్యోగం ఆరేండ్ల కనిష్ఠానికి చేరిందని ప్రధానమంత్రి నరేంద్రమోదీ గొప్పలు చెబుతున్నా వాస్తవాలు ఇందుకు భిన్నంగా ఉన్నాయి. దేశవ్యాప్తంగా ఐటీఐల్లో నైపుణ్య శిక్షణ పొందిన అభ్యర్థుల్లో 0.09శాతం మందికి మాత్రమే ఉద్యోగాలు లభించడం ఇందుకు నిదర్శనం. నీతి ఆయోగ్ ఇటీవల తమ నివేదికలో ఈ విషయాన్ని వెల్లడించింది. వాస్తవాలు ఇలా ఉంటే, మోదీ మాత్రం తన హయాంలో 'కౌశల్ వికాల్ స్కీం' పేరుతో కోటిన్నర మందికి శిక్షణ అందించినట్టు గొప్పలు చెప్పుకోవడం విడ్డూరం. దేశంలోని ఐటీఐల్లో సగటున 70శాతం ఇన్‌స్ట్రక్టర్ల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. వీరిలో 15శాతం మంది మాత్రమే తగిన విద్యార్హతలు, శిక్షణ పొంది ఉన్నట్టు నివేదిక పేర్కొంది. కొన్ని కాలేజీల్లో 100శాతం ఇన్‌స్ట్రక్టర్ల పోస్టులు ఖాళీగా ఉన్నట్టు వివరించింది. వాస్తవాలు ఇలా వుంటే ప్రధాని మోదీ మాత్రం దేశంలో నిరుద్యోగం ఆరేండ్ల కనిష్ఠానికి చేరుకున్నదని ఇటీవల ఢిల్లీలో జరిగిన కౌశల్ వికాస్ శిక్షణ కార్యక్రమంలో పేర్కొనడం గమనార్హం.

తెలంగాణలో 17లక్షల ఉద్యోగాలు

కేంద్రం నుంచి ఎలాంటి సహకారం లభించకున్నా రాష్ట్ర ప్రభుత్వం పరిశ్రమల ఏర్పాటు కోసం పెద్ద ఎత్తున చర్యలు చేపడుతున్నది. తొమ్మిదిన్నరేండ్లలో రాష్ట్రానికి సూక్ష్మ, చిన్న, మధ్య తరహా కలిపి 23వేల పరిశ్రమలు రాగా, వాటి ద్వారా దాదాపు 17 లక్షలకుపైగా ఉద్యోగాల కల్పన జరిగింది.

నీతి ఆయోగ్ నివేదిక ప్రకారం

- **దేశవ్యాప్తంగా ఐటీఐల్లో నిరుడు శిక్షణ పూర్తి చేసుకున్న వారు: 4,14,247మంది**
- **ఉద్యోగాలు దక్కించుకున్నవారు: 405 మంది (0.09శాతం)**
- **తమిళనాడులో ఉద్యోగాలు : 3.2 శాతం**
- **గుజరాత్‌లో ఉద్యోగాలు పొందినవారు: 0.25 శాతం మంది**
- **దేశంలోని ఐటీఐలలో ఖాళీ పోస్టులు: 70%**
- **కొన్ని కాలేజీల్లో ఖాళీల సంఖ్య: 100శాతం**
- **తెలంగాణ మొత్తం ఐటీఐలు: 295**
- **మొత్తం సీట్లు: 54,340**
- **ఖాళీలు: దాదాపు సగం**

బస్సుల్లో తోలారు.. బిల్లులు మరిచారు!

- **గుజరాత్‌లో ప్రధాని మోదీ, సీఎంల కార్యక్రమాల కోసం జనాల తరలింపు**
- **మూడేండ్లలో అద్దెకు 35 వేల బస్సులు**
- **ఆర్టీసీకి రూ.22 కోట్ల మేర బకాయిలు**

న్యూఢిల్లీ, అక్టోబర్ 14: గుజరాత్‌లో ప్రధాని మోదీ, ముఖ్యమంత్రి సభలు, సమావేశాల కోసం వేలాది బస్సులను పెట్టి ప్రజలను తరలించడం, ఆ తర్వాత దానికి సంబంధించి ఆర్టీసీకి చెల్లించాల్సిన కోట్లాది రూపాయాలు చెల్లించకుండా రాష్ట్ర ప్రభుత్వం జాప్యంచేయడం చర్చనీయాంశంగా మారింది. గత మూడేండ్ల వ్యవధిలో గుజరాత్‌లో ప్రధాని మోదీ, సీఎం హాజరైన ప్రభుత్వ కార్యక్రమాల కోసం ప్రజలను తరలించేందుకు దాదాపు 35 వేల ఆర్టీసీ బస్సులను వాడారు. అయితే ఈ బస్సుల అద్దెకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం ఆర్టీసీకి ఇంకా రూ.22 కోట్